


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -158-

**(8 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రయాణాలు చేయడం ఒక గొప్ప కళ.** కొందరు అతి తేలికగా ఒక వూరు నుంచి ఒక వూరు పరుగెత్తుతూ వుంటారు. మళ్ళీ అంత తేలిగ్గా వచ్చి ఇంట్లో పడుతూ వుంటారు.

వారితో మాట్లాడదామని వెడితే "రాత్రే హైదరాబాద్నుంచి వచ్చా, రేపు రాత్రికి మద్రాసు వెడుతున్నా. అయిదో తారీకు ఇక్కడో మీటింగ్ వుంది అది చూసుకుని ఏడు ఉదయం విశాఖపట్నం వెళ్ళాలి. అక్కడో రెండురోజుల పని" అంటూ ఉంటారు.

వీరి మాటలు వింటున్నప్పుడు "ఇంత తేలిగ్గా ఎలా ఎగిరి వివిధ ప్రాంతాల్లో పడుతూ వుంటారా?" అనిపిస్తుంది. మొన్న హైదరాబాదులో ఒక మిత్రుణ్ణి కలిశాను.

ఆయన అన్నాడు "రాత్రే అమెరికానుంచి వచ్చా. నిన్న రెండు మూడు గంటలు ఢిల్లో ఆగా. అంతే. పదింటికి ఆఫీసుకి వెళ్ళాలి" అన్నాడు.

"ఓరి నీ యిల్లు బంగారంగానూ ఖండాంతరాల నుంచీ వచ్చినా, అంత శాంతంగా వున్నావేమిటి పైగా ఒకపూటన్నా రెస్టు లేకుండా అలా ఆఫీసుకి ఎలా పరుగెత్తుతున్నావు?" అన్నాను.

"ఆ!ఏం వుంది? అమెరికానించి రావడంలో ఏం వుంది? ఇదివరకు ఒకసారి వెళ్ళాను" అన్నాడు.

"అమెరికా నుంచి రావడమేముంది అంటావేమిటి? భీమవరం వెళ్ళివస్తే మూడురోజులదాకా రెస్టు కావాలి అసలు రెండురోజులు ఆ ప్రయాణాన్ని గురించి చెప్పడానికే సరిపోతాయి" అన్నాను.

అతగాడు నవ్వి "అమెరికా గురించి తెలియని విషయాలేం వున్నాయి. కాకపోతే నే వెళ్ళినప్పుడు మైనస్ పదిహేను డిగ్రీలుంది టెంపరేచర్" అన్నాడు.

"ఓరి నీవెంతవాడవయ్యా మైనస్ పదిహేనులో బ్రతికి భారతదేశానికి తిరిగి వచ్చావా? నిజంగా నువ్వు ఏ ఉత్తర ధ్రువంలోనో పుట్టవలసిన వాడివి. ఎలా తట్టుకున్నావు? కాళ్ళూ, చేతులూ పదహారు వంకరలు తిరిగిపోలా? ముక్కు గోదావరినది పుట్టిన 'గోముఖం' అయిపోలా?" అన్నాను.

"అబ్బే ఏం లేదు ఇంట్లో పరవాలేదు ఎయిర్ కండిషన్ వుంది. వీధుల్లో నడిచేటప్పుడే కొంచెం కష్టంగా వుండేది. అదీ ఇదీ చుట్టుకోవలసి వచ్చేది" అన్నాడాయన.

"ఇదేదో విచిత్ర జనం రాత్రిపూట నిద్రపోతుండగా వాన కురిస్తేనే తెల్లవారేసరికి జలుబు పట్టుకు వస్తుంది. ఆవిరి పట్టేదాకా వదలదు. అయిదుపూటలు మజ్జిగ మానెయ్యాలి. అలాటి నువ్వు మైనస్ పదిహేనులో తట్టుకుని బయట పడ్డావంటే ఎన్నికల్లో గెలిచినవాడి కంటే ఎక్కువగా ఊరేగించవలసిందే" అన్నాను.

ఆయన నవ్వి "అదేం అక్కరలేదు. అలాంటివి అలవాటు చేసుకోవాలి. శరీరాన్ని అదుపులో పెట్టుకోవాలి" అన్నాడు.

"మా బోటి వాళ్ళను అదే అదుపులో పెడుతుంది. వొణికిపోతున్నాం దాని పేరు చెపితే –" అన్నాను.

ఏమిటో ఈ రోజుల్లో ఒక దేశం నుంచి మరో దేశానికి ఇట్లే వురుకుతున్నారు. ఇతర దేశాలమీద మనకు మోజు ఎక్కువ అవుతోంది. పసుమర్రు కుర్రవాళ్ళు మాస్కోలో చదువుతున్నారని వల్లూరులో ఒక అబ్బాయి వాషింగ్టన్‌లో చదువుతున్నాడని ఇలా ఎన్నెన్నో చెప్పుకుంటున్నారు.

"ఫలానా వ్యక్తి పెద్ద చదువుల నిమిత్తం నిన్ననే ఇంగ్లాండుకు బయలుదేరి వెళ్ళాడు అని పత్రికల్లో ప్రకటిస్తున్నారు అందరు. ఎందుకు ఇప్పుడు నాకు లండన్ వెళ్ళే ఓపిక వుండాలిగాని బెజవాడలో వున్నంతమంది బంధువులూ అక్కడా వున్నారు. కాకపోతే ఇళ్ళు వెతుక్కోవడం కష్టంగాని తర్వాత తీరిగ్గా తిష్టవేసే అవకాశాలూ, సదుపాయాలూ చాలా ఉన్నాయి.

అందాకా ఎందుకు మా మనవడు రోజూ అంటూ వుంటాడు. మాంట్‌సోరీలో చదువు అవగానే పీటర్స్‌బర్గ్‌కు వెడతాను అని లిబియాలో ఒక మిత్రుడన్నాడు. అతడొకసారి వ్రాశాడు. 'మీరు కూడా ఇక్కడికి వస్తె ఎంతో బావుంటుంది. తెలుగు మాష్టరు ఉద్యోగాలు చాలా వున్నాయి. జీతాలు బాగా ఇస్తారు' అని.

వెళదామనుకుంటే లిబియా ఏమిటి? అరేబియా వెళ్ళి, నైరోబీ వెళ్ళవచ్చు. కాని భారతదేశం మీద అభిమానం నన్ను సముద్రాలు దాటనివ్వడంలేదు. అందుకు వస్తే ప్రాంతీయాభిమానం నన్ను వదలనివ్వడంలేదు.

ఒక్కొక్క జన్మలో భారతదేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో జన్మించి ప్రాంతీయాభిమానాన్ని కాపాడుకోవాలని మాత్రం వుంది. జన్మపరంపరల మీద విశ్వాసంగల వాళ్లం అలా ఆశించడం తప్పులేదు.

మొత్తం మీద ఇల్లు విడిచి మరో వూరు వెళ్ళడమనే ఒక గొప్ప అనుభూతే అవుతుంది 'పర్యటన పెద్ద పాఠ్యగ్రంథం అన్నారు. అందుకనే పెద్దలు మొన్న ఒక మిత్రుడితో మాట్లాడుతూ "మనం కూడా వూళ్ళు తిరగడం నేర్చుకోవాలి. ఈ పని జంటగా ప్రారంభిద్దాం. నా వెంట నువ్వూ, నీవెంట నేనూ" అన్నాను.

అతగాడు పకపక నవ్వి "ఏమిటి నావెంట నువ్వు నీ వెంట నేనూ అంటున్నావు. నువ్వు చెప్పేది ఏదో ప్రేమికుల డ్యూయెట్‌లాగా వుంది. ప్రయాణాలు జంటగా ఎక్కడ కుదురుతాయి. నీ వంట్లో బలం వున్నప్పుడు నువ్వు వెళ్ళు. నా వంట్లో వున్నప్పుడు నేపోతా. ఇద్దరికీ ఒకేవూరు వెళ్ళాలని మాత్రం ఎలా అనిపిస్తుంది? ఒకరికి మంత్రిపదవి, మరొకరికి పర్సనల్ అసిస్టెంటు పదవీ వస్తే తప్ప అలాటి అవకాశాలుండవు" అని నా మాట కొట్టి పారేశాడు.

ఏమిటో ఈ ప్రయాణాలు ఇప్పుడెక్కువ అయిపోయినాయి. దేశంలో పూర్వం ఏ పుణ్యక్షేత్రానికో తిరిగేవారు. ఈ రోజుల్లో నానా క్షేత్రాలకూ తిరుగుతున్నారు. నానా దేవతల్నీ మ్రొక్కుతున్నారు. నానా వరాలూ కోరుతున్నారు.

ఒకాయన చెప్పాడు గవర్నమెంటు తమకు రావలసిన బిల్లు మీద కొంత ముప్పయి రెండు యాత్రలు చేశానన్నా ఆశ్చర్యంలేదు.

ఒక కంపెనీలో డబ్బు రావలసి నేను ఇంచుమించుగా అన్ని యాత్రలూ చేశాను. ఇంకేమి చెయ్యాలో తెలియదు. ఇవన్నీ "గలివర్సు ట్రావెల్సు"లాంటివి.

Post your comments